# ఆమె బేల - అతను ధీరుడు! ఐతేనేం!!

తురగా జానకీరాణి



క్రేన్ కథలపోటీలో
సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ

స్కూలు విడిచి పెట్టగానే సైకిలెక్కి పరుగో పరుగు అని వెళ్లే అనిల్ - ఆ రోజు సైకిలు టైరులో గాలి తక్కువైందని మెల్లిగా నడిపించుకుంటూ వస్తున్నాడు. అంతకుముందే గ్రౌండులో వాలీబాల్ నాలుగు గేమ్స్ ఆడి, అలసిపోయి వున్నాడు. సాయంత్రం స్కూలు టైము అయినాక, వాలీబాల్ ప్రాక్టీసు చేస్తున్నాడు రోజూ., జిల్లాలో ట్రోఫీ గెలుచుకున్నారు. ఇక స్టేట్ లెవల్‌కు వెళ్లాలి.

సైకిలు నడిపించుకుంటూ గేటువరకు వెళ్లడానికి ఐదునిముషాలైనా పడుతుంది. శీతాకాలం ఎండలో చెట్టు కొసలు ఎర్రగా కనుపిస్తున్నాయి. ఆకలేస్తోంది. ఇంటికెళ్లేటప్పటికి అమ్మ వేడి వేడి అన్నం సిద్ధంగా వుంచుతుంది. స్టేటు లెవెలు, ఆతరువాత జాతీయస్థాయి కూడా గేమ్స్ దగ్గరవుతుండడంతో సాయంత్రం ట్యూషను పొద్దున్నకి మార్చుకున్నాడు అనిల్.

పరధ్యానంగా వున్న అతనికి చెట్టుకింద సిమెంటు బెంచీమీద కూచున్న ఆకారం కనుపించింది. ఉలిక్కిపడ్డాడు. క్లాసులు అయిపోయి కనీసం గంట అయింది. ఆ అమ్మాయి యింకా ఏం చేస్తున్నట్టు? దగ్గరికి వెళ్లేటప్పటికి కనిపించింది ఆ అమ్మాయి ఏడుస్తోందని. ఆమె ఫమీదా ! క్లాసు మొత్తానికీ, ఆ మాటకొస్తే స్కూలుకే బ్యూటీక్వీన్. నిర్ఘాంత పోయినాడు అనిల్.

టక్కున నడక ఆపి, సైకిలు స్టాండు వేశాడు. "ఫమీదా! ఏం జరిగింది ? ఎందుకు, ఎందుకు ఏడుస్తున్నావు?" అంటూ ఇంగ్లీషులోనే అడిగాడు. దుపట్టాలో ముఖం దాచుకుని, భోరు మని ఏడిచింది. తమాయించుకుని, 'ఇట్సాల్‌రైట్', అన్నది.

"ఏమిటి ఆల్‌రైట్? చీకటి పడుతున్నది. ఇంటికి వెళ్లవా?" అన్నాడు.

"వెడతాను, వెళ్లక ఏం చేస్తాను?" అన్నది కళ్లు తుడుచుకుని తన బ్యాగు తీసుకుంది.

"పద మరి. నిన్ను మీ యింటి దగ్గర దింపి నేను వెడతాను. రోజూ ఆటోలో వస్తావేమో కదా!"

''ఈవేళ ఆటో రాలేదు''అని నడక సాగించింది. అనిల్‌కి వింతగా అనిపించింది. తను అంత బాగా పలుకరించి, ఏమిటి సంగతి అని అడిగాక, ఆమె తనని పట్టించుకోకుండా, గబగబ నడిచేస్తోండడం.

"నువ్వు ట్యుటోరియల్‌కి వెడతావుగా! ఈ వేళ మానేశావా?" అన్నాడు.

ఆమె కొంచెం ఆగి, "మానేశాను" అన్నది.

"మీ యింట్లో ఏమీ అనరా అల్లా ఎగ్గొట్టేస్తే?"

"అంటారు" అన్నది. ఇప్పుడింక తెలుగులోనే మాట్లాడుకుంటున్నారు ఇద్దరూ.

"కోప్పడతారని నీకు భయం లేదా?"

"ఉంది, చచ్చేంత భయం" అన్నది. పెంకిగా ఇలా ముక్తసరిగా జవాబులు చెప్తొంటే అనిల్‌కి కోపం వస్తోంది. కానీ లిల్లీపువ్వులాంటి ఫమీదా పక్కన, చీకట్లు ముసిరేవేళ నడవడమే ఒక గొప్ప అవకాశం.

గేటు దగ్గరికి వచ్చారు. గేటు మూసి వుంది. చౌకీదారు గొళ్లెం

వేసి, ఎక్కడికో వెళ్ళినట్టున్నాడు. "ఇంకా నయం, తాళం వేసేయలేదు", అన్నాడు అనిల్.

గొళ్లెం తీసుకుని ఫమీదా గేటు బయటికి నడిచింది. వెనకాలే సైకిల్ పట్టుకుని అనిల్.

"ఎల్లా వెడతావు? నీకు అబ్జెక్షన్ లేకపోతే సైకిలులో గాలి కొట్టించుకొని, నిన్ను దింపేస్తాను" అన్నాడు.

ఫమీదా తీవ్రంగా చూసింది. అనిల్ తడబడ్డాడు. "అహ.... అదే...నీకు అభ్యంతరం లేకపోతేనే..." అన్నాడు.

"చాలా అభ్యంతరం అనిల్! ఆడపిల్లతో కలిసి సైకిల్ డబుల్స్ వెళ్లాలని అనుకుంటున్నావంటే - అనిల్! నన్ను గురించి ఏమనుకుంటున్నావో?" అన్నది.

అనిల్ బిత్తరపోయాడు. "అయామ్ సారీ ఫమీదా! నేను నీకు హెల్ప్ చేద్దామనే అన్నాను. పోనీ - ఆటోలో వెళ్లిపోతావా?" అనడిగాడు.

ఫమీదా మాట్లాడకుండా అక్కడేతచ్చాడుతోంది. అవతలి వేపు రోడ్డుమీద షాపుల్లో లైట్లు కూడా వేసేశారు. వీళ్లు నిలబడిన ఫుట్‌పాత్ చివరివరకు స్కూలుగోడ వుంది. ఒకరిద్దరు పళ్లబండ్లవాళ్లు. వేరుసెనగ బుట్టల వాళ్లు వుంటారు వీధి లైటుకింద.

"తొందరగా చీకటి పడుతోంది ఫమీదా! మీ ఇల్లు దగ్గరేనా? నేను మీ వీధి చివరి వరకు వస్తాను. దూరమా?" అన్నాడు.

"దగ్గరేం కాదు. దూరమే అనిల్! నాకు చాలా ఆకలేస్తోంది. నీ దగ్గరేమైనా డబ్బులున్నాయా?" అన్నది ఫమీదా.

అనిల్‌కి చెప్పలేనంత జాలి వేసింది. ఆశ్చర్యం కూడా కలిగింది.

"ఇక్కడే వుండు. సైకిలు చూస్తుండు" అని ఒక్క పరుగులో రోడ్డు దాటి వెళ్లి దుకాణం దగ్గర రెండు అరటిపళ్లు. బిస్కెట్లు కొనుక్కొచ్చాడు. ఆమె ఆవురుమంటూ తినేసింది. అనిల్‌ని తింటావా అనికూడా అడగలేదు.

"థ్యాంక్యూ - నేను వెళ్లిపోతాను... మన క్లాసులో ఎవరికీ చెప్పకేం ఈ సంగతి?" అన్నది.

"అహ - చెప్పను. ఫమీదా! నన్ను నీ ఫ్రెండు అనుకో!" ఫమీదా రోడ్డు దాటి ఎదురుగా వున్న సన్నరోడ్డులోకి మలుపు తిరిగి వెళ్లిపోయింది. ఒక్కసారి కూడా వెనక్కి తిరిగి 'టాటా' చెప్పని ఆమె వాలకం చూసి, కళ్లు వప్పగించి అక్కడే నిలబడ్డాడు అనిల్. ఆమె మలుపు తిరగగానే సైకిలు స్పీడుగా నడిపిస్తూ, గాలికొట్టించుకోవడానికి బయలుదేరాడు.

అంతసుకుమారి, రాకుమారి లాంటి రీవి ఉట్టిపడే అందగత్తె ఫమీదా బతుకులో ఏదో దుఃఖం వుందని అర్థమైంది అనిల్‌కి. ఇద్దరూ ఆ పబ్లిక్ స్కూలులో పదకొండో క్లాసులో వున్నారు.

మెల్లిమెల్లిగా కొద్ది రోజులలోనే అనిల్‌కి ఫమీదా సంగతులు తెలిశాయి. ఆమె తండ్రి ఒక పెద్ద ఫ్యాక్టరీలో ఉద్యోగి. జీతం బాగానే వుంటుంది. వాళ్లు ఆ ఫ్యాక్టరీ దగ్గర క్వార్టర్సులోనే వుంటారు. ఫమీదాకి ఒక తమ్ముడు వున్నాడు. ఏడోతరగతి. కానీ బోర్డింగుస్కూలులో వుండి చదువుకుంటున్నాడు.

అసలు పెద్ద ట్రాజెడీ - ఫమీదా సవతి తల్లి అమీరున్నీసా పెట్టే కష్టాలు. పదో ఏటనే తల్లి చనిపోయింది. ఇద్దరు పిల్లలను సాకలేక మళ్లీ పెళ్లి చేసుకున్నాడు ఆ తండ్రి.అమీరున్నీసా ఆయన కంటే పదహారేళ్లు చిన్నది. ఆమెకీ ఒక పిల్లవాడు, మూడోఏడు.

పెళ్లయిన నాటి నుంచి ఆమెకు ఈ ఇద్దరు సవతి పిల్లలంటే ఏదో కసి కోపం. తనకో కొడుకు పుట్టాక, వీళ్లు మరీ కంటకమై మగ పిల్లవాడిని బోర్డింగులో పడేయించింది. చాకిరీ చేసుకుని పిన్నిని మెప్పిస్తూ చదువు సాగిస్తోంది ఫమీదా. అదొక్కటే నాన్న ఆమెకిచ్చిన గొప్ప అవకాశం. అందగత్తె కనుక, గల్ఫ్ నించి ఎవరైనా డబ్బున్నవాడు తారసపడి లక్షలు పోసి ఆమెను తీసుకుపోతాడని అమీరున్నీసాకి లోలోపలి ఆలోచన. సానబట్టని వజ్రంలా, పాలతో కడిగిన ముత్యంలా సౌందర్యం చిమ్ముతున్న సవతి కూతుర్ని చూసి ఆ మారుటి తల్లికి అసూయ లోలోపల రగులుతుంటుంది.

ఆ తరువాత చాలాసార్లు అనిల్, ఫమీదా కలుసుకున్నారు, స్కూలులోనూ ఆ కాంపౌండు బయటా కూడా. ఆమె తను ట్యూషనుకి వెడుతున్నానని చెప్పేదో ఏమోగానీ నాలుగు గంటలకి బెల్ అయిపోతే ఐదువరకు అక్కడే తచ్చాడేది. అనిల్ గేము ప్రాక్టీసు కాగానే వచ్చేసేవాడు. మిగిలిన పిల్లలంతా వెళ్లేగేటు కాక, రెండోగేటు దగ్గరలో ఏదో చెట్టు చాటున కూర్చుని వుండేది.

అనిల్ తన వయస్సుని మించిన పొడగరి. పదిహేడో ఏటనే అతను నూనూగుమీసాల స్థాయి దాటి, వెడల్పయిన వెన్నుపట్టీతో, భుజాలతో పురుషాకారం రూపుదిద్దుకుంటున్నాడు. ఫమీదా కూడా పొడగరి. 16 నిండాయి ఆమెకీ.

ఎప్పుడూ చిన్నబుచ్చుకున్న ముఖంతో, దిగులు వర్షించే కళ్లతో వున్న ఆమెకి - తన మనస్సు విప్పి గుమ్మరించుకోవడానికి ఎన్నో మాటలు వుండేవి. అల్లాంటి ఒక రోజున ఆమె పుస్తకం ఒళ్లో పెట్టుకుని, నోట్సు రాసుకుందామని ప్రయత్నిస్తోంటే, ఉన్నట్టుండి వాన వచ్చింది. అదీ వడగళ్లవాన. ఆమె లేచి పెద్ద చెట్టుకిందకి పరుగిడుతోంటే అనిల్ శరవేగంగా సైకిలు తొక్కుకుంటూ వచ్చాడు.

"ఫమీదా! చెట్టుకింద నిలబడకు, ఆకాశం ఉరుముతోంది. పిడుగు పడితే చెట్టు బూడిదై పోతుందట" - అని ఆయాసపడుతూ ఆమె బ్యాగు అందుకున్నాడు. ఇద్దరూ పరుగున గేటు దాటి కాంపౌండు బయటికి వచ్చారు.

గోడనానుకుని నిలబడితే కూడా, మీద గులకరాళ్లలా వడగళ్లు పడుతున్నాయి. చుట్టూ మల్లెపూలలా అవి పరుచుకుంటోంటే ఒకరి కొకరు దగ్గరగా జరిగారు. "వాన తగ్గిపోగానే యింటికి వెళ్లిపోతావా? ట్యూషనుకా?" అన్నాడు. ఫమీదా మాట్లాడకుండా రోడ్డువేపు చూస్తోంది.

"ఆకలేస్తోందా?" అన్నాడు.

"నాకెప్పుడూ ఆకలిగానే వుంటుంది" అన్నది ఆమె. సైకిలు గోడకి ఆనించి, వడగళ్లను కూడా లెక్కచేయకుండా పరుగెత్తికెళ్లి ఎదురు బేకరీలో క్రీపఫ్‌లు, సమోసాలు కొనుక్కొని వచ్చాడు అనిల్. ఆమెకు ఎప్పుడూ ఆకలి వున్నట్టే అతని దగ్గర ఎప్పుడూ డబ్బులు వుంటాయి. ఆమె యిల్లాంటి వాటికి థ్యాంక్యూ చెప్పటం మానేసింది. గబగబ ఆత్రంగా

తినడం, తన బాటిల్‌లో నీళ్లుంటే తాగడం, లేకపోతే అనిల్ బ్యాగులోంచి బాటిలు తీసేసు కుని తాగేయడం, అందుకే ఒక్కొక్కసారి అనిల్ తన నీళ్ల సీసాలోంచి చివరి గుక్కదాకా తాగ కుండా కొన్ని వుంచేవాడు.

"అనిల్ ! నేను మీ యింటికి రానా?" అన్నది ఫమీదా, తను తినగా మిగిలిన రెండు ముక్కలు అతనికిచ్చేస్తూ.

అనిల్ ఏమీ అనలేకపోతున్నాడు. "మా యింటికా? ఎందుకు ఫమీదా? ఎలా – ఎల్లా వస్తావు?" అన్నాడు.

ఫమీదా సీరియస్‌గా వుందని ఆమె ఊపిరి చెబుతోంది. వాన తగ్గింది. వడగళ్లు ఆగి పోయాయి. రోడ్డుమీద కార్లు, ఆటోలు, బస్సులు తిరుగుతున్నాయి. మనుష్యులూ నడవడం మొదలుపెట్టారు.

"ఏమైంది? మీ పిన్ని నిన్ను ఏమైనా అన్నదా? మీ డాడీ పట్టించుకోవడం లేదని బాధగా వుందా?" అన్నాడు.

ఫమీదా అతనికి మరింత దగ్గరగా జరిగింది. "అనిల్! నీతో మా యింట్లో జరిగిన సంగతులు ఎట్లా చెప్పాలో తెలియడం లేదు. మా పిన్ని చెడ్డది. చాలా చాలా చెడ్డది," అన్నది.

"ఔను, చెడ్డదే! లేకపోతే దేవతలాంటి నిన్ను అల్లా బాధపెడుతుందా? నీ డబ్బాలో ఎండిపోయిన రొట్టెలు, పాతవాసన కూర పెడుతుందా?" అన్నాడు.

"అంతకంటె కూడా చాలా చెడ్డది. సినిమాల్లో చూపిస్తారే – వాంప్ అన్నమాట. పిశాచి" అన్నది.

అనిల్‌కి ఆమె ఏమి చెప్పబోతోందో అంతు చిక్కడం లేదు. "ఓహో అల్లాగా! మీ డాడీకి తెలియదా ఆమె అంత చెడ్డ పిశాచి అని?" అన్నాడు.

ఫమీదాకి మాటలు చేతకాక విసు గొచ్చింది. "మీ ఇంటికి వెళ్లి మాట్లాడుకుందాం, తీసుకెళ్లు" అన్నది. "చీకటి పడిపోతే మీ పిన్ని నిన్ను కొడుతుందేమో!" అన్నాడు అనిల్.

గడిచిన కొద్ది మాసాలుగా వీళ్లిద్దరూ మాట్లాడుకోవడం, వింత అనుబంధంగా నవ్వు కోవడం, కొందరు పిల్లలు గమనించారు. వాచ్‌మెన్‌కూడా పసిగట్టాడు కానీ, పన్నెండో క్లాసులో ప్రవేశించబోయే పిల్లల్లో కొన్నిసార్లు ఇదిమామూలే. చూసీచూడనట్లు ఊరుకునేవారు. పైగా అనిల్ క్లాస్‌లీడరు కూడా.

తన యింటికి ఒక ముస్లిం క్లాసుమేటును అందులోను అనార్కలి లాంటి అందగత్తెను తీసుకు వెళ్లడానికి అనిల్ సంకోచపడుతున్నాడు.

విధి లేనట్టు "సరే పద" అన్నాడు ఒక ఫర్లాంగు నడిచాక దోవలో చిన్నపార్కు వస్తుంది.

అనిల్ ఆగిపోయి, "ఫమీదా! నిన్ను గురువారం మా యింటికి తీసుకెళ్లగలను. మా అమ్మ సాయిబాబా గుడికి వెడుతుంది. నాన్న గారు టూరు వెళ్లారు. ఇప్పుడు.... ఈ వేళ ఈ పార్కులో కూచుందాం – ఏం?" అన్నాడు బతిమాలుతున్నట్టు.

ఫమీదా ఎంతో దీనస్వరంతో 'సరే' అన్నది. ఇద్దరూ వెళ్లి ఒక బెంచీ మీద కూర్చు న్నారు. వర్షం వల్ల అసలు జనమే లేరు. "అనిల్! నాకు ఎల్లా చెప్పాలో తెలియడం లేదు" అన్నది.

"ఎల్లాగో చెప్పెయ్ ఫమీదా!"

"మా ఇంట్లో ఒక వంటవాడున్నాడు. అన్ని పనులు వాడే చేస్తాడు. ఇదివరకు మా అమ్మకు పనిమనిషే వుండేది కాదు. ఇప్పుడు ఈ పిన్ని కష్టపడుతోందని రెండేళ్లక్రితం ఒక కుర్రవాణ్ణి తెచ్చిపెట్టారు. మనకంటే కొంచెం పెద్దవాడనుకో. వాడు తమ్ముడితో ఆడుకుంటాడు. పనులన్నీ ఎంతో బాగా చేస్తాడు. నాకూ ఎప్పుడైనా తినడానికి ఏదైనా పెడుతుంటాడు."

కథలాగా ఆమె చెబుతోంటే వింటున్నాడు కానీ అసలు సమస్య ఏమిటో అనిల్‌కి అర్థం కాలేదు.

"వాడు – వాడిని, మా పిన్ని – సినిమాల్లో చూపిస్తారు చూడు, అట్లా!" అన్నది ఫమీదా పూర్తిగా తలదించుకుంటూ.

ఆకాశంలో ఒక మెరుపు మెరిసింది. ఆ మెరుపులో అనిల్‌కి ఫమీదా, దీనాతిదీనమైన ముఖం కనబడింది. అంటే అంత స్పష్టంగా ఆమె రూపు చూడగలిగాడని కాదు. దగ్గరగా కూచున్న ఆమె మాటల్లోని అర్థం స్ఫురించింది; స్పష్టంగా స్ఫురించింది.

ఫమీదా అతనికి దగ్గరగా జరిగింది. "నేను యింటికి మధ్యాహ్నం పూట వెళ్లినప్పుడు ఆ పిశాచి, వాడిని రూములోకి తీసుకెళ్లి...." అంటోంటే "తలుపు వేసుకోలేదా!" అన్నాడు అనిల్ అదొక ఊపులో.

ఫమీదా ఔనని తలూపింది. "చాలా ఛండాలం. నేను ఆ సంగతి చూసి బైటికి వెళ్ళి పోయేదాన్ని. రోడ్డు మీదకు వెళ్లి పిచ్చిగా చూస్తూ నిల్చునేదాన్ని" – అన్నాది. ఫమీదా అతని ఒడిలోకి వాలిపోతోంది.

కదలకుండా, ఆమె సన్నని బెంచీమీద నుంచి పడిపోకుండా, తన చేతులు ఆమెని అతిగా అదిమెయ్యకుండా అల్లాగే కూచున్నాడు అనిల్.

"మీ డాడీకి చెప్పకపోయావా?" అన్నాడు. ఆమె లేచి కూచుంది. "అమ్మో ! చంపేస్తారు."

"నిన్నెందుకు చంపుతారు?"

"ఆ పిశాచి అంటే ఎంతో ముద్దు" అన్నది. ఎంత పెద్ద సమస్య !

"నిన్న సాయంత్రం చీకటి పడ్డాక వాడు వంటింట్లో చపాతీలు చేస్తున్నాడు. ఈ పిశాచి లోపలే వుంది. నేనింకా రాలేదనుకుంది. మా తమ్ముడు హాల్లో సోఫాలో నిద్రపోతున్నాడు", అని కథ సాగిస్తోంది ఫమీదా. ఆ చీకట్లోనే, పార్కు లైటు మీదపడుతోంటే గడియారం చూసు కున్నాడు అనిల్. ఫమీదా చటుక్కున లేచి నిల బడింది. డ్రెస్సు సరిచేసుకుంటోంది. "పద, వెడ దాం"అన్నది కీచుగా. అనిల్ ఆమె చేయి పట్టు కుని గట్టిగా గుంజాడు. ఆమె కూలబడింది.

"ఏమిటంత కోపం? నీకు లేటు అయితే దెబ్బలు తింటావేమోనని నా భయం. అందుకే టైము చూశాను. ఆరు కావస్తోంది." ఫమీదా మళ్లీ అతని భుజం మీద వాలిపోయింది. ఆ స్పర్శ, ఆ దగ్గరితనంలో ఎంతో ఇష్టం. తన ఒంటిని అతని మీద పడేయడంలో ఎంతో ప్రేమ వుంది.

"చెప్పు. వాళ్లిద్దరూ వంటింట్లో వున్నారు."

"పిశాచి గట్టిగా అరుస్తోంది." మీ ఊరికి పోతావా? ఎందుకురా? ఒక్కరోజు కాదు, రెండు రోజులు కాదు, నెలరోజులు! ఎందుకురా?" అన్నది.

వాడు ఏదో గొణిగాడు. " ఆ ? నీకు

పెళ్లా ? ఎప్పుడురా? ఎందుకురా?" అన్నది. నేను మనిషిని కానా, నాకు పెళ్లి కాకూడదా అన్నట్టున్నాడు. "ఔను, నువ్వు మనిషివే. కానీ నీకు పెళ్లితో ఏంపనిరా?"అన్నది తను అరుస్తున్న సంగతి, ఎవరికేనా వినబడుతుందేమోనన్న విషయం మర్చిపోయి ఆమె మాట్లాడుతోంది.

"నేను పోతే, నీకు ఎవరో ఒకరు దొరుకుతారు బేగం! నీతో చెప్పకుండా పోదామనుకున్నాను" అన్నాడు వాడు.

"పోతావా? ఎట్లా పోతావో నేను చూస్తాను. పోలీసులకి పట్టిస్తాను. సార్‌తో చెప్పి చావగొట్టిస్తాను" అన్నదామె. ఆమె యిక బయటికి వచ్చేస్తుందని అర్థమై నేను వెనుక తలుపులోంచి జారుకున్నాను. ఇంటి చుట్టూ తిరిగి వచ్చి వరండాలో షూస్ వేసుకున్నాను. కొంతసేపాగి, ఇంట్లోకి వెళ్లాను, అప్పుడే వస్తున్నట్టు.

ఆ పిశాచి తమ్ముడు నెత్తుకొని గదిలోకి వెడుతూ కోపంగా చూసి, "ఇప్పుడా రావడం? ట్యూషను లేదా?" అన్నది.

"లేదు, మా సార్ అమ్మమ్మ చచ్చిపోయింది. సెలవు "- అన్నాను.

"నాకు కడుపులో ఎంతో వికారంగా వున్నది. రహస్యమంతా తెలిసిపోయింది. దొంగరాస్కెల్ మానాన్నని మోసం చేస్తోంది. వాడిని పిశాచిలాగా పట్టుకుంది" అని నిర్భయంగా, నిర్మొహమాటంగా, పచ్చిగా ఫమీదా కథ చెప్పేసింది.

అనిల్ కూడా పత్రికల్లో యిల్లాంటి కథలు చదివాడు. సినిమాల్లో, టి.వి.సీరియల్స్‌లో చూశాడు. కానీ తనకు ఇంత బాగా తెలిసిన ఫమీదా ఇల్లాంటి చిక్కుల్లో పడిపోయిందంటే నమ్మకం కుదరడం లేదు.

"ఇప్పుడేం చేద్దాం ఫమీదా?" అన్నాడు సన్నగా. "ఏం చేస్తాను అనిల్? ఎవ్వరితోటీ చెప్పడం నాకు చేతకాదు. నేను చచ్చిపోతే, మానాన్న ఏదో ఒకటి చేసుకుంటాడు" అని ఆ ఆలోచనకే దుఃఖం వచ్చి ఏడిచింది.

"ఫమీదా, పోదాం పద, చీకటి పడుతోంటే నాకు యింకా భయం వేస్తోంది. చెడు వినకు, చూడకు, మాట్లాడకు అని చెప్పారు గాంధీగారు. నువ్వు నీ చదువులో పడిపో, ఏమీ తెలియనట్టు వుండు, పరీక్షలు అయిపోతాయి. నాకు పన్నెండో క్లాసు కాగానే ఆర్మీలో చేరిపోతాను. నిన్ను నాతో తీసుకువెళ్ళిపోతాను" అన్నాడు లేస్తూ.

ఒక యువప్రేమికుడిగా, ఆమెను తొలిసారి కౌగిలించుకుంటూ, బుగ్గమీద గట్టిగా ముద్దు పెట్టేసుకున్నాడు. ఆ వెచ్చదనానికి ఆమె మరింత అతనిని వాటేసుకుని, గాఢంగా దగ్గరైంది. కానీ యిద్దరికీ భయమే! ఈ ప్రేమవల్ల సమస్య ఏమి పరిష్కారమౌతుంది.

"పద, పద వెళ్లిపోదాం" అన్నాడు.

"అనిల్! ప్లీజ్ అనిల్! నాకు ఎవ్వరూ లేరు ఈ లోకంలో. ఎవ్వరికీ చెప్పలేనివి నీకు చెప్పాలనిపిస్తుంది. నీ జుట్టు, నీ నవ్వు నా కళ్లముందు ఎప్పుడూ వుంటాయి. నాకు పిచ్చి ప్రేమ నువ్వంటే – ఎప్పుడో; ట్వెల్త్ క్లాస్ అంటే ఎప్పుడో కదా?" అన్నది. ఆమె మెడ, చెంపలు, జుట్టు అన్నీ అతడిని చేరుకోవాలని చీకటిలో వెతుక్కుంటున్నాయి.

"అనిల్! మీ యింటికి తీసుకువెళ్లిపో. మీ అమ్మగారు చాలా మంచివారని చెప్పావుగా! నన్ను అక్కడే దాచేయి. ఆవిడ నాకు అన్నం పెడతారుగా! నేనంటే ఆవిడకి జాలి వుండదా అనిల్" అంటూ ఆమె వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది.

ఏమి చేయడానికి తోచక, మళ్లీ ఆమెను ముద్దుపెట్టుకుని తన ఆపేక్షనంతా తెలియజేయాలని ప్రయత్నిస్తున్నాడు.

"ఏడవకు ఫమీదా! నువ్వు ఏడుస్తోంటే నాకు ఏమీ తోచడం లేదు. నేనింకా చిన్నవాణ్ణి కదా! ఆలోచిద్దాం గురువారం మా యింటికి వస్తావుగా! మా అమ్మతో చెప్పు" అన్నాడు.

ఫమీదా అతనికి దూరంగా జరిగి బ్యాగు భుజాన వేసుకుని పార్కు చెట్ల మధ్యనుంచి తడిసిన మట్టిమీద గట్టిగా అడుగులేస్తూ, గబగబ పార్కు గేటువేపు నడిచింది. ఎప్పటిలాగే స్కూలు ఎదురుగా వున్న రోడ్డులోంచి వెళ్లిపోతోంది.

ఆ వీధిలోని మొదటి లైటు కిందికి చేరాక వెనక్కి తిరిగి చేయి ఊపింది. ఆమె రెండో లైటు చేరేవరకు అక్కడే నిలబడి చూస్తున్న అనిల్‌కి, ఆమె మళ్లీ అక్కడే ఆగి చేయి వూపడం కనిపించింది. ఆమె యింకా ఏడుస్తోందా?

వీధంతా పెద్ద వెలుతురు నింపుతున్న ఆ లైటు కాంతిలో ఫమీదా, తెల్లని పూలు విరగబూచిన అందమైన మొక్కలాగ కనబడుతోంది. ఆ తర్వాత వీధి మలుపు తిరిగే వరకు చూసి వెనక్కి తిరిగి, యమస్పీడులో సైకిలు తొక్కుకుంటూ ఇంటివేపు వెళ్లాడు అనిల్.

మర్నాడు మంగళవారం. ఫమీదా స్కూలుకి రాలేదు. ఏమి జరిగిందోనని గిజగిజలాడాడు అనిల్. వానకు తడిసి జ్వరం వచ్చిందేమో! వాళ్ల పిన్నికి, ఆ వంట కుర్రాడికి తెలిసిపోయిందేమో ఫమీదా అంతా గ్రహించిందని! వాళ్ల నాన్నతో ఆమె మాట్లాడిందేమో ! ఏమో!

గేమ్సు దగ్గరికి వస్తున్నాయని చాలాసేపు ప్రాక్టీసు చేసి అలసిపోయి యింటికి వెళ్లిపోయాడు. గేటు దగ్గర, చెట్టుకింద, బెంచీ మీద ఫమీదా కూర్చున్నట్టే భ్రమ కలుగుతోంది. ఆ గేటులోంచే బయటికి నడుస్తూ వెర్రిగా వెనక్కి తిరిగి చూశాడు.

అన్నం తింటున్నా అదే ధ్యాస ! చదువుకుంటున్నా అక్షరాలు అర్థం కావటం మానేశాయి. అమ్మకి చెప్పి ఏం చేయమంటావని అడిగితేనో ! కానీ అంత బూతు కథ ఎల్లా చెప్పగలుగుతాడు? గురువారం తీసుకువచ్చి ఫమీదానే చెప్పమనాలి. లైటు ఆర్పేసి బలవంతంగా కళ్లు మూసుకుని కలవరం నిండిన మనస్సుతో పడుకున్నాడు.

మర్నాడు బుధవారం. ఏడు గంటలకు ట్యూషనుకి వెళ్లాలి. అమ్మ టిఫిన్ పెట్టింది, బాక్సు సర్ది యిచ్చింది. ఐసు నీళ్లు బాటిలులో పోస్తోంది.

ఒరేయ్ అనిల్! పేపర్లో చూశావా! ఎంత ఘోరమో! అన్నది. "ఏమిటమ్మా?" అని పరధ్యాసలో అడిగాడు.

"మీ స్కూలట ఆ పిల్లా - ఆ పిల్లనీ, వాళ్ల పిన్నినీ, మూడేళ్ల తమ్ముణ్ణీ - అందర్నీ వాళ్ల వంటవాడు చంపేశాట్ట!" అంటూ ఆవిడ పేపరు షీటు మడతపెట్టి యిచ్చింది.

ఉలిక్కిపడ్డాడు అనిల్. గుండె ఆగిపోయిందా అన్నట్టు, మెదడు తిమ్మిరెక్కి

పోయిందా అన్నట్టు పేపరు తీసుకున్నాడు. కళ్లముందు అలుక్కుని పోయినట్టున్న ఆ వార్త చదవలేకపోతున్నాడు. ఔను,ఔను,ఔను-ఆ పిశాచి తల్లి, ఆవిడ గారాబు కొడుకు, యింకా-యింకా-షమీదా-అందరి ఫోటోలు. ఘోర మైన స్థితిలో - వాళ్లముగ్గురూ - వాళ్లందరూ బాగున్నప్పటి ఫోటోలు.

"అయ్యో! అయ్యో!" అని పగిలిపోతున్న గుండెతో, బిగ్గరగా ఏడ్చేస్తూ, స్కూలుబ్యాగు విసిరిపారేసి, పిచ్చిగా వీధిలోకి పరుగెడుతున్నాడు అనిల్. అమ్మ కనబడడం లేదతనికి. ఆమె తికమక పడుతోంది. "ఏరా నీకు బాగాఫ్రెండా?" అంటోంది ఆమె. ఆమె మాటలూ వినబడడం లేదు.

ఆ పిల్ల తనకి ఫ్రెండు, తన ప్రాణం ! తను లేవదీసుకు వచ్చి, పెళ్లి చేసేసుకుని, తన యింట్లో ఒక గదిలో దాచేస్తే బతికి వుండేది షమీదా! తన ప్రేమని, ఆమె ప్రేమని, తనలో ఆమె నమ్మకాన్ని బిగ్గరగా నలుగురితో అప్పుడే చెప్పేస్తే షమీదా నవ్వే కళ్లతో బతికే వుండేది. ఆమె మనస్సులో మండిపోతున్న కొలిమిని, తన అనురాగంతో తడిపి చల్లారిస్తే బతికి వుండేది షమీదా!

ఆ మంచి కుర్రవాడి మనస్సులో, నీలాకాశం లాంటి ఆ గుండెలో ఆలోచనలు స్పష్టంగా లేవు. ప్రశ్నలు కూడా యిల్లా వరుసలుగా రావడంలేదు. కొత్త ప్రేమికుడి హృదయంలో ముక్కలు ముక్కలుగా విరిగి,అంతులేని దుఃఖంలో మునిగిపోయాయి. తీరని వేదనతో నిండిన ఆ గుండెలోతు కళ్లు మూసిన షమీదాకి తెలియదు. తెలిసినా జరిగేదేముంది?

(పేపరులో వచ్చిన దారుణమైన హత్యా వార్త మాత్రమే వాస్తవం - మిగిలినది కల్పన)

**అణువుల్లాంటి**
**చిరు కవితలకు**
**స్వాగతం.**

రామా కవితల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కవిత

# తండాలుడు

అతగాడు శ్వాస పీల్చగానే
'రయ్'మని వీచేగాలి
ఒక్కసారిగా స్తంభించిపోతుంది
స్వేచ్ఛగా విహరించే విహంగాలు
గూటి దారిన పడ్తాయి.
అతడు ధరిత్రిని కనుసైగతో
శాసిస్తాడు.
ఆకాశాన్ని సైతం రొమ్ము విరచి
ఉరుముతాడు
యముడు మహిషమెక్కినట్లు
అతడు వాహనమెక్కి
సాయం సంధ్యకల్లా
వేటకు వెళ్ళే మహారాజౌతాడు.
అతడి మాట అట్టే
శాసనమై ప్రతిఫలిస్తుంది.
అతడి దౌష్ట్యం
ఎదుటివాడ్ని అచేతనుల్ని చేస్తుంది.
అతడు దౌర్జన్యమై
పెట్రేగిపోతాడు.
దుర్మార్గమై పోటెత్తి పోతాడు
దీనహీన చరితలే
అతడికి ఆహారం.
బాధల గాధలే నిత్య స్ఫూర్తి
మంగళ ప్రదాయకం.
అడిగిందే తడవుగా
అవసరమే తనదిగా
అప్పుల ఊబిలోకి
ఆహ్వానం పలుకుతాడు.
ఆప్తుడిగా
నటనాగ్రేసరులను అధిగమిస్తాడు.
రేయింబవళ్లు శ్రమించినా రైతుకు
దిగుబడి రాకపోవచ్చునేమోగాని
దివారాత్రాలు మగ్గంవేసినా
చేనేతకు 'చేయి' మిగలవచ్చేమోగాని
పోటీ ప్రపంచంలో
వ్యాపారి పారిపోయే దుస్థితి
దాపురించవచ్చేమోగాని
ఇక్కడ -
వీడు గురిపెట్టి విసరిన నోటు మాత్రం
ఋణగ్రస్తుడి కుటుంబాన్ని
నిలువునా కూల్చే క్లైమోర్‌మైన్‌గా మారి
అట్టే పేలుస్తుంది.
గ్రోమోర్ లేకుండానే
వడ్డీల పంటల్ని పండిస్తుంది.
వర్షాభావ సమయాన సైతం
నోట్ల కట్టల జడివాన కురిపిస్తుంది.
తీసుకున్న వాడి అగచాట్లు
ఇంతింతలై -
ఋణగ్రస్తుడి కష్టాలు
ఇతగాడి పాలిట కొండలై
వాడి బ్రతుకు చట్టుబండలై
అతగాడికి తండలై
ధనరాశుల్ని కుమ్మరిస్తుంది.
వాడి ఇల్లాలు వీడికి తాళికట్టని భార్యయై
కడతేరుతుంది.
ఏనాటి పాపమో -
ఏ జన్మపు శాపమో -
కాసింత ఊపిరి నలుపని వాళ్ళు
ఎవరికీ పట్టని వాళ్ళు.......
వారిపాడ ఎవరికీ గిట్టని వాళ్ళు....
తమ రక్తం రూపాయలుగా మార్చి
తమ కండలు నోట్లుగా కూర్చి
గుండెలు గుభేల్ మన్పించే
వడ్డీలు తండలుగా కట్టే
సాదాసీదా జనం వాళ్ళు.
గుండెల్లో నెగళ్ళను
దాచుకొన్న వాళ్ళు
తమ చర్మంతో వాడి కోట బురుజుకు
జెండా కుట్టించే నిరుపేదలు వాళ్ళు
వాళ్ళు ఋణ విముక్తి కోసం
నిత్యం పడే ఆరాటాలే... సలిపే పోరాటాలే.....
అరిచే ఆక్రందనలే.....
తండాలుడికి నిత్య నీరాజనం
ఆ ఛండాలుడికి నిత్య నివేదనం !

- చిన్ని నారాయణరావు